క్లుప్తంగా

ఆయాలకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సాంబశివ

పీలేరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలకు జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు, స్వీపర్లకు నాలుగు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. ఆయాలకు, స్వీపర్లకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరసింహులు, వేణుగోపాల్‌రెడ్డి, ఆయాలు యశోదమ్మ, శ్రీలక్ష్మి, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: భవిత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిస్లెక్సియాపై అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యాసనకు సంబంధించిన లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు. అభ్యసనం సమస్యలు కలిగిన పిల్లలను గుర్తించి వారిని తగిన విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుల ద్వారా తరగతిలో అభ్యసన సమస్యలు గల పిల్లలకు తగిన శిక్షణ అందించాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్ర, ఐఈఆర్పీలు ఎ.నాగేంద్ర, రెడ్డమ్మ, రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి

రామసముద్రం: రామసముద్రం ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కుసుమకుమారి కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు గ్రామాల్లో ప్రజలకు అత్యవసరంగా కావాల్సిన మందులు, మాత్రలు అందజేయాలన్నారు. అలాగే ఆసుపత్రికి కావాల్సిన మందులు తెప్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టి క్లోరినేషన్, బ్లీచింగ్ చేయించి అంటు రోగాలు ప్రబలకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా, డీటీ నారాయణరెడ్డి, ఏఓ గౌస్‌బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

పీలేరు : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ నల్లగుట్టలో ఉచిత వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలతో డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌రెడ్డి, హెచ్‌ఈ కొండయ్య, సిబ్బంది శ్రీనివాసులు, కుసుమ, విజయకుమారి, ధనమ్మ, ఆయేషా పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

పెద్దమండ్యం: తహసీల్దార్ కార్యాలయాన్ని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. మండలంలోని గ్రామాల వారీగా ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఆర్‌ఐ రమేష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

టమాటాకు ముసురు దెబ్బ

- భారీగా తగ్గిన రేటు
- రూ.1000 నుంచి రూ.600కు పతనం
- తుపాను కారణంగా మరింత తగ్గుతున్న ధరలు
- వర్షాలు, తెగుళ్లతో తగ్గిన దిగుబడి



టమాటా పంటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారులు

మదనపల్లె సిటీ: ముసురు వర్షం టమాటా రైతుల కొంపముంచింది. ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో చేతికందిన టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకొని సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం జరగడంతో లబోదిబోమంటున్నారు. నిన్నటి దాకా 10 కేజీల క్రేట్ రూ.వెయ్యి దాకా ఉండగా వర్షం కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. మదనపల్లె మార్కెట్‌లో శుక్రవారం 10 కేజీలు రూ. 600 పలికింది. ఇలాగే ముసురు వర్షం మరో మూడు రోజులు పడితే టమాటా రైతులు మరింత నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి తోడు సూర్యరశ్మి లేకపోవడంతో పంటకు ఆకుమచ్చ తెగుళ్లు సోకి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంచిన వాన

నెల రోజులుగా టమాటా ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఇదే సమయంలో ముసురు వర్షం కారణంగా టమాటా క్వాలిటీ తగ్గి సరుకు నాణ్యత తగ్గుతోంది. దీంతో ఉన్నట్టుండి 10 కేజీల క్రేటు ధర రూ.640 కి పడిపోయింది. ఇలాగే వర్షం పడితే ధరలు మరింత తగ్గే ఆకాశం ఉంటుందని టమాటా వ్యాపారులు చెబుతున్నారు. వారం రోజులుగా 10 కేజీల క్రేట్ మొదటి గ్రేడ్ సగటున రూ.600 పలికింది. అలాగే మార్కెట్‌కు దిగుబడులు కూడా భారీగా తగ్గుముఖం పట్టాయి.

పంటకు తెగుళ్ల దెబ్బ

వర్షం కారణంగా టమాటా తోటలకు ఆకుమచ్చ, బూడిద తెగుళ్ల సోకాయి. దీంతో కోతకు సిద్ధంగా ఉన్న టమాటాలో క్వాలిటీ తగ్గింది. ఫలితంగా నాణ్యత తగ్గిన టమాటాకు మార్కెట్‌లో ధర పలకడం లేదు. మరో మూడు రోజులు ముసురు వర్షం ఇలాగే ఉంటే ధరలు భారీగా పతనం కావడం ఖాయంగా కనిపిస్తోంది. వర్షాలకు దెబ్బతిన్న టమాటా పంటలను హార్టికల్చర్ అధికారులు పరిశీలించారు.

తెగుళ్లు సోకుతున్నాయి



టమాటా పంటకు ముఖ్యంగా సూర్యరశ్మి ఉండాలి. మూడు రోజులుగా వర్షాల కారణంగా గాలిలో తేమ శాతం బాగా తగ్గింది. ఫలితంగా టమాటా తోటల్లో వైరస్ ప్రభావం పెరిగి పంట క్వాలిటీ దెబ్బతింటుంది. రైతులు తోటల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే వెంటనే తొలగించాలి. మొక్కలు నీటిలో నానకుండా, కుళ్లిపోకుండా చర్యలు తీసుకోవాలి.

–ఈశ్వరప్రసాద్, హార్టికల్చర్ అధికారి, మదనపల్లె

వర్షానికి పంట నష్టం



టమాటా పంటలో వర్షం నీరు నిలిచిపోవడంతో పంటకు తెగుళ్ల సోకాయి. కాయలకు మచ్చ ఏర్పడింది. ఇంకా వర్షం కురిస్తే మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. ధరలు బాగా పెరుగుతున్న సమయంలో వర్షం వల్ల ధరలు తగ్గుతున్నాయి. మంచి ధర పలుకుతుందని అనుకున్నాం. ఇంతలోనే వాయుగుండం రూపంలో నష్టపోవాల్సి వస్తోంది.

–బావానాయక్, రైతు, ఆర్‌ఎస్ తాండ, తంబళ్లపల్లె మండలం

పార్టీ బలోపేతానికి కృషి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి వివిధ సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ బలోపేతం అయ్యేలా చూస్తామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా దాడులు జరిగినా సహించేది లేదని, రోడ్లపై బైఠాయించి ధర్నాలు చేస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వ పథకాలను అమలు చేయకుండా నాటకాలు ఆడుతుందని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవ్వగానే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు పరచి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు దాటినా ప్రజలకు ఒక్క హామీ కూడా అమలు చేయకుండా.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. పీలేరు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని పీలేరు నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారు.

మురుగు.. పరుగు

పీలేరు: పీలేరు పట్టణం– మేకలవానికాల్వ మార్గంలో రైల్వే కల్వర్టు కింద మురుగునీరు పేరుకుపోయి దుర్గంధ భరితంగా మారింది. అజంతామిట్ట, యర్రమరెడ్డిగుట్ట, లక్ష్మీపురం, శ్రీనివాసనగర్ ప్రాంతాల నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. మురుగునీటి కాలువ లేకపోవడంతో రైల్వే కల్వర్టు కింద మురుగునీరు పేరుకుపోయి దోమల వృద్ధికి నిలయంగా మారింది. దీనికి తోడు వర్షాలు పడడంతో అస్తవ్యస్తంగా తయారైంది. సంబంధిత అధికారులు అటువైపు చూడడంలేదని, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ మురుగునీటిని దారిమళ్లించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



మేకలవానికాల్వ మార్గంలో ప్రవహిస్తున్న మురుగునీరు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ తదితరులు

కలకడ : గ్రామాల అభివృద్ధే లక్ష్యమని ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ అన్నారు. మండలంలోని ముడియంవారిపల్లె, నవాబుపేట, ఎనుగొండపాళ్యం, దిగువతాండ, కదిరాయచెర్వు పంచాయతీలలో రూ.14.50లక్షల ఉపాధిహామీ పథకం నిధులతో అభివృద్ధిచే యనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీడీఓ శుక్రవారం భూమిపూజ చేశారు. త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివారిపల్లెలో..

కేవీపల్లె : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గాలివారిపల్లెలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 8 లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పల్లెపండుగను జయప్రదం చేయండి

రామసముద్రం: రామసముద్రం మండలంలో శనివారం జరిగే పల్లెపండుగ కార్యక్రమం జయప్రదం చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై సీసీ రోడ్లకు భూమి పూజలు, శంకుస్థాపన చేస్తారన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తప్పకుండ హాజరుకావాలని కోరారు.

మెడికల్ కాలేజీ రద్దుకు కుట్ర



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్

మదనపల్లె : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మదనపల్లె మెడికల్ కాలేజీని రద్దుచేసేందుకు కుట్రచేస్తోందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్‌కు, మదనపల్లె మెడికల్ కాలేజీని పూర్తిచేసి, ప్రారంభించేందుకు తమ వద్ద సరిపడా నిధులు లేవని చెప్పడంతో మదనపల్లె మెడికల్ కళాశాలకు అనుమతులు రాలేదన్నారు. ప్రస్తుతం మదనపల్లె మెడికల్ కాలేజీ కోసం కేటాయించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య కళాశాల సిబ్బంది ఇతర కళాశాలలకు ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా వెళ్లిపోతున్నట్లు తెలిసిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి మెడికల్ కళాశాల పెండింగ్ పనులను పూర్తి చేసి, ఎన్‌ఎంసీ అనుమతులు తీసుకువచ్చి ప్రభుత్వ ఆధ్వర్యంలో కళాశాలను నిర్వహించాలని కోరారు. బీఎస్పీ నాయకులు రమణ, ఉదయ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలి



మాట్లాడుతున్న హరికృష్ణ తదితరులు

మదనపల్లె : రాష్ట్రంలోని వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో పునరుద్ధరణకై వాల్మీకి సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాశి హరికృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రాగిమానుసర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వాల్మీకులకు ఎస్టీ జాబితాలో స్థానం కల్పించాలని కోరారు. వాల్మీకి మహర్షి జయంతిని నేషనల్ హాలిడే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వాల్మీకి మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల సుదర్శన్‌బాబు, జిల్లా అధ్యక్షులు బొగ్గిటి కృష్ణమూర్తి, నాయకులు సాకే కృష్ణమూర్తి, రామకృష్ణ, సుస్మిత్, సాకేమల్లప్ప పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ముజాహిద్ అలీ

కురబలకోట: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని హైదరాబాదు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముజాహిద్ అలీ ఆకాంక్షించారు. శుక్రవారం అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఆర్థిక విద్యపై రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక విద్య సమాజంలో ప్రతి ఒక్కరికీ అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువకులకు చదువుతో పాటు ఆర్థిక విద్యపై అవగాహన ఉండాలన్నారు. సమాజంలో డబ్బు అత్యంత విలువైనదని, దీనితో ముడిపడి మనిషి మనుగడ సాగుతోందని పేర్కొన్నారు.

నట్టల మందుతో ఆరోగ్యంగా జీవాలు



గొర్రెకు నట్టల నివారణ మందు తాపిస్తున్న డాక్టర్ నీరజ

వాల్మీకిపురం: నట్టల మందుతో జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యశాల ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ నీరజ తెలిపారు. గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో గొర్రెలకు నట్టల మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవాల్లో సాధారణంగా ఉండే అంతర పరాన్న జీవులైన పొట్ట జలగలు, పలిక పాములు, బద్దెపురుగులు జీవాలను ఆశ్రయించి వీటిలో రక్తహీనత, పునరుత్పత్తి సమస్యలు కలిగిస్తాయని పేర్కొన్నారు.

22న జాబ్‌మేళా

పీలేరురూరల్ : స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న జిల్లా స్థాయి మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి డి. నాగార్జున, ప్రిన్సిపాల్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. 18 – 30 సంవత్సరాల మధ్య వయస్సు గల పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టాటా కాపిటల్, ముత్తూట్ ఫైనాన్స్, యంగ్ ఇండియా కంపెనీల్లో రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు నెల జీతం పొందవచ్చునని తెలిపారు. వివరాలకు 9966086996, 8997776368 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కబడ్డీ లీగ్‌లో విద్యార్థిని సత్తా

పీలేరురూరల్ : మంగళగిరిలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర కబడ్డీ లీగ్–2024 టోర్నమెంట్‌లో పీలేరు మహాత్మా జ్యోతిబాపూలే ఏపీబీసీ బాలికల గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి జి. హేమశ్రీ సత్తా చూపినట్లు ప్రిన్సిపాల్ వి.రాధారాణి తెలిపారు. శుక్రవారం విద్యార్థినిని పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళగిరి కబడ్డీ లీగ్‌లో చిత్తూరు జట్టు మూడో స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పుష్పలత, పీఈటీ అమరావతి పాల్గొన్నారు.

వర్షాలకు పంట నష్టం

పీలేరురూరల్ : నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో ఐదు ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు ఏఓ రమాదేవి తెలిపారు. శుక్రవారం పీలేరు, ముడుపులవేముల గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. మహేశ్వర్ రెడ్డి, శకుంతలమ్మకు చెందిన వరిపంట నీట మునిగిందని, జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి గణిత శిక్షణకు ఎంపిక

నిమ్మనపల్లె : బెంగళూరు కేంద్రంగా జాతీయస్థాయిలో గణిత సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్న, ఆల్ గర్ల్స్ నర్చర్ క్యాంప్, (ఏజీఎంఎస్ సీ–2024) మ్యాథమెటీషియన్ ఫౌండేషన్ సంస్థ శిక్షణకు రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని శ్రీ హాసిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేఎస్ఎన్ మూర్తి తెలిపారు. మదనపల్లె మండలం వలసపల్లికు చెందిన శ్రీహాసిని, ఏజీఎంఎస్ సీ–2024 శిక్షణకు జాతీయ స్థాయిలో అక్టోబర్ 13న నిర్వహించిన పరీక్షల్లో 10/10 పాయింట్లు సాధించి ఎంపికై నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

మదనపల్లె : పట్టణంలోని నార్త్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామారావుకాలనీ, ఎస్‌బీఐ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, సీటీఎంరోడ్డు, ప్యారానగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ సెక్షన్ ఏఈ ముజమ్మిల్ తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

పెద్దతిప్పసముద్రం: శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయమని మదనపల్లి డీఎస్పీ కొండయ్య నాయుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం మదనపల్లి డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, రౌడీ షీటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీసుల పట్ల ప్రజలకు స్నేహభావం ఏర్పడేలా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును ఖచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. రాత్రి వేళ గస్తీ నిర్వహించాలని సూచించారు.

నాటుసారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

పెద్దమండ్యం: మండలంలోని వెలిగల్లు పంచాయతీ కోతుల గుట్ట అటవీ ప్రాంతంలో శుక్రవారం నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 100 లీటర్ల నాటుసారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ పి. వెంకటరమణ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. వెలిగల్లు కోతుల గుట్ట అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ డ్రమ్ములు, నీటి బిందెలలో నిలువ ఉంచిన నాటుసారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెచ్‌సీ పీజే ఖాన్, నాగరాజు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదులో మార్పులు సరి చేసుకోండి

నిమ్మనపల్లె : మండలంలోని రైతులు ఈ క్రాప్‌లో నమోదైన పంట వివరాల్లో మార్పులు ఉంటే సరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. 2024–2025 ఆర్థిక సంవత్సరంలోని ఖరీఫ్ సీజన్‌కు గాను మండలంలోని 10 పంచాయతీల పరిధిలో పంటల వివరాలను ఈ క్రాప్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ వివరాలను 12 రైతుసేవా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం జాబితాలను ప్రదర్శించామని తెలిపారు. స్థానికులు రైతులు జాబితాలోని వివరాలను పరిశీలించుకుని, ఏవైనా మార్పులు ఉంటే సంబంధిత వ్యవసాయ సహాయ అధికారికి తెలియజేసి, సరి చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని సౌకర్యాలతో గోడౌన్ నిర్మించాలి

జేసీ ఆదర్శ రాజేంద్రన్



గోడౌన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

తంబళ్లపల్లె: అన్ని సౌకర్యాలతో సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను నిర్మించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో రూ.69 లక్షల అంచనాతో నిర్మిస్తున్న గోడౌన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గోడౌన్‌కు రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. పాత కాలేజీ మైదానంలో రోడ్డు ఏర్పాటు చేస్తే స్థానికులకు అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, ఐటీఐ విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందని జేసీ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అనంతరం సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..



మహబూబ్‌నగర్‌లో చెత్తకుప్పలను తొలగిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు

గుర్రంకొండ: ఎట్టకేలకు గుర్రంకొండ మేజర్ పంచాయతీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన సంపద కరిగింది.. చెత్తమిగిలింది.. అన్న కథనానికి అధికారులు స్పందించారు. డీపీఓ బాలకృష్ణారెడ్డి శుక్రవారం పట్టణంలోని బస్టాండు, పలువీధుల్లో పర్యటించారు. మురుగునీటి కాలువలు, చెత్తకుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బస్టాండు, మహబూబ్ నగర్ వీధుల్లో చెత్తకుప్పలు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను వాహనాల ద్వారా పట్టణం వెలుపలికి తరలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోతే రోగాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించే కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ ఈఓ హరి, కార్యదర్శి నిస్సార్, సిబ్బంది పాల్గొన్నారు.